



విద్యుత్తు అధికారులతో ఏర్పాట్లపై చర్చిస్తున్న సీఎండీ సంతోష్‌రావు తదితరులు

మహానాడు విద్యుద్దీకరణ పనుల పరిశీలన

సీకేదిన్నె, మే 19 (ఆంధ్రజ్యోతి): మహానాడు ఏర్పాట్లలో భాగంగా విద్యుద్దీకరణ పనులను ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు సోమవారం పరిశీలించారు. జిల్లా విద్యుత్తు అధికారులతో కలసి మహానాడు ప్రాంగణాన్ని పరిశీలించి నిరంతరాయంగా విద్యుత్తు కల్పించేందుకు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మహానాడు కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరవుతారని ఎటువంటి చిన్న విద్యుత్తు సమస్య తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్తు లోడుకు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లైన్ల ఏర్పాటు గురించి అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నాగరాజు, హరిసేవ్యానాయక్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు. కాగా.. మహానాడు ఏర్పాట్లను ఎమ్మెల్యేలు చైతన్యరెడ్డి, ఆర్‌.మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్‌.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. అక్కడ జరుగుతున్న స్టేజీ నిర్వహణ, విద్యుద్దీకరణ పనులు తదితర పనులను పర్యవేక్షించారు.

ప్రభుత్వ పథకాల అమలులో ప్రజా స్పందనలపై మరింత దృష్టి

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు, సేవల ప్రజా స్పందనలపై మరింత దృష్టి సారిస్తామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుంచి స్టేట్ ప్రాజెక్టు మానిటరింగ్ గ్రూపు యోగాంధ్ర-2025 క్యాంపెయిన్, ప్రభుత్వ పథకాలు, సేవలపై ప్రజా స్పందనలు, జిల్లా సబార్డినేట్ కోర్టుల్లో టాయిలెట్స్, కాంప్లెక్స్ వంటి వివిధ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మేరకు తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ స్టేట్ ప్రాజెక్టు మానిటరింగ్ గ్రూపు కింద అమలు చేస్తున్న ప్రాజెక్టుల్లో ఆయా జిల్లాలకు సంబంధించిన సమస్యలను పెండింగు లేకుండా పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టులకు సంబంధించి ప్రతి 15 రోజులకు ఒకసారి రివ్యూ చేస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పెద్దముడియం మండల సోలార్ ప్రాజెక్టుకు సంబంధించి రెవెన్యూ భూముల సమస్యలను పరిష్కరిస్తామని సీఎస్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, సీపీవో హజరత్తయ్య, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ చంద్రశేఖ ర్, జిల్లా పర్యాటక అధికారి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా వర్షం



కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం కురిసింది. దువ్వూరు మండలంలో అత్యధికంగా 15.4మిమీ వర్షపాతం నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఖాజీపేట మండలంలో 6.4 మిమీ, చెన్నూరులో 6.4, ఒంటిమిట్టలో 1.8, సిద్దవటం 24, కడప 4.8, సీకేదిన్నె 1.2, మైదుకూరు 2.2, బిమఠం 9.8, కాశినాయన 2.8, కలసపాడు 4.0., పోరుమామిళ్ల 1.8, బికోడూరు 10.2, బద్వేలు 7.4, గోపవరం 10.2, అట్లూరు 8.4 మి.మీ వర్షపాతం నమోదైంది. సోమవారం రాత్రి సైతం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది.

ప్రశాంతంగా ఏపీ ఈఏపీసెట్



కడప ఎడ్యుకేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంజనీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రాన్స్ టెస్ట్ (ఏపీఈఏపీసెట్ 2025) ప్రశాంతంగా ప్రారంభమైంది. తొలి రోజు సోమవారం ఈ పరీక్షకు 92శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలు కడప నగరంలో ఐదు కేంద్రాలు, ప్రొద్దుటూరులో మూడు కేంద్రాల్లో నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షలకు 860 మందికి గాను 781 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 859 మందికి గాను 803 మంది హాజరయ్యారు. జిల్లాలో రెండు సెషన్స్‌కు గాను 1,719 మంది హాజరుకావాల్సి ఉండగా 1,584 మంది హాజరయ్యారు.

దారి దోపిడీ ముఠా అరెస్టు

● రూ.6.50లక్షల విలువ చేసే వస్తువులు స్వాధీనం

కడప క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): మహిళల మెడలో బంగారు గొలుసులు లాక్కుని పోవడంతో పాటు రోడ్డుపై వచ్చే వాహనాలను ఆపి వాహనదాలను కొట్టి దోపిడీకి పాల్పడే ముఠాలోని ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి ఐదు తులాల బంగారు చైన్లు, ఒక ద్విచక్రవాహనం, ఒక కత్తి, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.10,200 నగదు కలిపి మొత్తం రూ.6.50 లక్షలు విలువ గల సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు సోమవారం తన కార్యాలయంలో కమలాపురం సీఐ షేక్ రోషన్, ఎస్‌ఐ విద్యాసాగర్, వల్లూరు ఎస్‌ఐ పెద్ద ఓబన్నతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితుల వివరాలు వెల్లడించారు.

చాపాడు గ్రామంలో పల్లవోలుకు చెందిన చక్రకొల్ల ప్రశాంత్, బద్రిపల్లెకు చెందిన పందిటి ఉదయ్‌కుమార్, దుంపల వినోద్ చెడు వ్యసనాలకు అలవాటు పడిన డబ్బుల కోసం తిరుపతిలో ద్విచక్రవాహనం దొంగతనం చేశారు. అందులో తిరుగుతూ ఒంటరిగా ఉన్న మహిళల మెడల్లోంచి బంగారు గొలుసులు లాక్కెళ్లిపోయేవారు. అలాగే వీరు రోడ్డుపై వచ్చే వాహనాలను ఆపి కొట్టి డబ్బును తీసుకుపోయి జల్సాలు చేసేవారు. ఈ క్రమంలో వారు ద్విచక్రవాహనంపై వస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో నిఘా ఉంచి ఆ ముగ్గురిని అరెస్టు చేసి బంగారు నగలు, కత్తి, నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు (ఇన్‌సెట్‌లో) దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు, సెల్‌ఫోన్లు, కత్తి, నగదు


కదులుతున్న కబ్జా పునాదులు

● వేలాది ఎకరాలు ఆక్రమించిన వైసీపీ నేతలు
● చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం
● ఇప్పటికే 914 ఎకరాల గుర్తింపు ● స్వాధీనానికి యత్నం
● అక్రమార్కుల గుండెల్లో రైళ్లు

ఐదేళ్ల జగన్ పాలనలో జిల్లాలో అడ్డుఅదుపు లేకుండా భూకబ్జాలు సాగాయి. వాగులు, వంకలు, చెరువులు చివరికి కొండలను కూడా ఆక్రమించేశారు. వీళ్ల భూదాహానికి కొందరు అధికారులు కూడా సహకరించారు. దీంతో విలువైన ప్రభుత్వ ఆస్తులన్నీ వైసీపీ నేతల పేరిట రికార్డుల్లోకి ఎక్కేశాయి. వైసీపీ నేతల భూకబ్జాలపై ఆంధ్రజ్యోతిలో పతాక శీర్షికలతో వరుస కథనాలు వచ్చాయి. భూకబ్జాలపై సీఎం చంద్రబాబు సీరియస్‌గా ఉన్నారు. అక్రమార్కుల భరతం పట్టాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ నేతృత్వంలో అధికార యంత్రాంగం భూకబ్జాదారుల పునాదులు పెకలిస్తూ ముందుకు సాగుతోంది.



బి.కోడూరులో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూముల రికార్డులను పరిశీలిస్తున్న బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ (ఫైల్)



నాయనిపల్లెలో కొండల నడుమ ఆక్రమణకు గురైన భూమి

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్యాక్రాంతమైన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటున్నారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చేపడుతున్న చర్యలు అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. వైసీపీ ఆక్రమణదారుల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములు తిరిగి స్వాధీనం చేసుకునేందుకు జేసీ అదితిసింగ్, ఆర్డీవోల ఆధ్వర్యంలో ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 914 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయినట్లు గుర్తించారు. వాటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. ఎకరా రెండు ఎకరాలు కాదు వేలాది ఎకరాలు ఆక్రమించుకుని దర్జాగా పంటలు సాగుచేస్తూ వస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబీకులతో పాటు కలసపాడు మండలంలో వైసీపీ నేత నల్లేరు విశ్వనాథరెడ్డి, కాశినాయన, బి.కోడూరు మండలాల్లో వైసీపీ నేతలు ఆక్రమించిన భూములను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు.

సజ్జల కుటుంబం చెరలో 63 ఎకరాలు

జగన్ హయాంలో ప్రభుత్వ సలహాదారుగా పనిచేసిన సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబీకులకు కడప నగర శివార్లలోని సీకేదిన్నె రెవెన్యూ పొలంలో సజ్జల ఎస్టేట్ ఉంది. అయితే ఇక్కడ 52 ఎకరాల అటవీశాఖ భూములతో పాటు వంక ఇతర భూములు కలిపి 63.72 ఎకరాల భూమిని ఆక్రమించినట్లు గుర్తించారు. సీకేదిన్నె రెవెన్యూ పొలం సర్వే నెం.1629లో 52.40 ఎకరాల అటవీ శాఖ భూములు ఆక్రమించినట్లు గుర్తించారు. అలాగే సర్వే నెం.1606/3లో 82 సెంట్లు, అసైన్డ్ వేస్ట్‌ల్యాండ్ 1612లో 1.25 ఎకరాలు, 1614/2లో 1.20 ఎకరాల అసైన్డ్ వేస్ట్‌ల్యాండ్, 1626/1లో 5.16 ఎకరాల పాయవంక రిజర్వాయరు కోసం కేటాయించిన భూమి, 1626/2లో సేకరించిన 1.84 ఎకరాలు, 1627లో 1.5 ఎకరాల వంక భూమి, 1629లో 40 సెంట్ల అటవీశాఖ భూమిని ఆక్రమించినట్లు గుర్తించి ప్రభుత్వానికి పంపించారు.

బద్వేలు డివిజన్‌లో..

భూకబ్జాలకు బద్వేలు నిలయంగా మారింది. ఇక్కడ అడ్డగోలుగా ఆక్రమించారు. వీటిపై ఇప్పుడు ఆర్డీవో చంద్రమోహన్ చర్యలు తీసుకుంటున్నారు. బద్వేలు డివిజనులోనే ఇప్పటికి 859.69 ఎకరాలు అన్యాక్రాంతం అయినట్లు గుర్తించారు.

● కలసపాడు మండలంలో నల్లేరు విశ్వనాధరెడ్డి ఎస్టేట్ ఉంది. అక్కడ 98.23 ఎకరాలు అన్యాక్రాంతం అయినట్లు గుర్తించారు. వైసీపీ నేత నల్లేరు విశ్వనాధరెడ్డి కలసపాడు మండలంలోని శంకవరంలో కొండలు, డాటెడ్ ల్యాండు, కొండ పరిధి మొత్తం 98.23 ఎకరాలు ఆక్రమించినట్లు గుర్తించారు. శంకవరం సర్వే నెం.2693లో 2.50ఎకరాలు, 2694లలో 2.50, 2695లో 2.70, 2696లో 2.61, 2692లో 9.80, 2663లో 6.80, 2665లో 2.88 ఎకరాలు అక్రమించారు. అలాగే సర్వేనెంబరు 2692/6లో 2.40 ఎకరాలు, 2692/7లో 5.20, 2692/8లో 5.20, 2692/9లో 5.20, 2691/1లో 5.31, 2691/2లో 5.34, 2690-1లో 2.40, 2692/5లో 5, 2693/3లో 4.50, 2689/1లో 1.25, 2689/2లో 1.54, 2688లో 6.22 ఎకరాలు మరికొన్ని సర్వేనెంబర్లు కలుపుకుని మొత్తం 98.23 ఎకరాలు ఆక్రమించినట్లు గుర్తించారు. ఇక్కడంతా అరటి, బత్తాయి ఇతర పంటలు సాగులో ఉన్నాయి.

● బి.కోడూరు మండలంలోని మున్నెల్లి రెవెన్యూ పొలంలో పోరుమామిళ్ల - బద్వేలు ప్రధాన రహదారి పక్కన ఉన్న కొండప్రాంతం, రోడ్డు, చెరువు పరివాహక ప్రాంతంతో పాటు 185 సర్వేనెంబరులో కలుపుకుని 363.54 ఎకరాలను ఆక్రమించారు.

● కాశినాయన మండలంలోని నాయనిపల్లెలో సర్వే నెం.130లో 81 ఎకరాల కొండ, సర్వేనెం.129/1లో 54.50 ఎకరాలకొండ, 217లో 189 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించారు. ఇక్కడ మొత్తం 316.50 ఎకరాలు ఆక్రమించినట్లు గుర్తించారు.



● బీ.మఠం మండలంలోని రేకలకుంట్ల, అగ్రహారంలో 81.69 ఎకరాలు ఆక్రమించినట్లు అధికారులు గుర్తించారు. బద్వేలు డివిజనులోనే 859.69 ఎకరాలు ఇప్పటికే గుర్తించారు. వీటిని స్వాధీనం చేసుకునేందుకు యత్నాలు మొదలుపెట్టారు.

పకడ్బందీగా..

భూ ఆక్రమణలపై టాస్క్‌ఫోర్స్ టీం ఆక్రమణదారులకు ఎలాంటి అవకాశం లేకండా ముందుకు పోతున్నారు. డ్రోన్‌తో సర్వే చేసి ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుంటున్నారు. లీగల్‌టీంతో అడ్వయిజ్ చేసుకుంటూ ముందుకు పోతున్నారు. ఇప్పటికే సుమారు 914 ఎకరాల అన్యాక్రాంత భూమిని గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకునే చర్యలు మొదలు పెట్టారు. దీంతో జగన్ హయాంలో ఆక్రమణలతో చెలరేగిపోయిన వైసీపీ నేతల్లో ఇప్పుడు వణుకు పుడుతోంది.

భారత్ మాతాకీ జై

● పులివెందులలో మారుమోగిన నినాదం



పులివెందుల వీధుల్లో సాగుతున్న తిరంగా ర్యాలీ

పులివెందుల, మే 19 (ఆంధ్రజ్యోతి): భారత త్రివిధ దళాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో వారికి మద్దతుగా పులివెందుల ప్రజలు తిరంగా ర్యాలీ భారత్ మాతాకీ జై అంటూ నినదించారు. సోమవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో పాతబస్టాండ్ నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం మీదుగా పూలంగళ్ల వరకు ఈ ర్యాలీ సాగింది. నియోజకవర్గంలోని అన్ని పార్టీల నుంచి ఈ ర్యాలీకి తరలివచ్చారు. త్రివర్ణపతాకం చేతబూని నినాదాలుచేస్తూ ముందుకు సాగారు. పూలంగళ్ల కూడలిలో మానవహారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని ప్రేరేపించే ఏ దేశమైనా భారత్ ఉపేక్షించదన్నారు. భారతదేశ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీయాలనుకునే వారందరికి మన దేశ రక్షణ రంగం ఎలా ఉందో చాటి చెప్పిందన్నారు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని పార్టీలను, అన్ని వర్గాలను కలుపుకుని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. మన దేశంపైకి ఎవరు వచ్చినా అందరం అన్నదమ్ముల్లా కలిసికట్టుగా ఉందామని ముస్లిం మైనార్టీ యువకులు, నాయకులు తిరంగా ర్యాలీకి మద్దతు ప్రకటించారన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతానికి త్రివిధ దళాలు చేపట్టిన ఆపరేషన్ విజయవంతమైందన్నారు. ఇందులో పాల్గొన్న సైనికులకు, వీరసైనికులకు సెల్యూట్ చేస్తున్నామన్నారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి ప్రసంగించారు. ఈ ర్యాలీలో చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.



తిరంగా ర్యాలీలో మాట్లాడుతున్న బీటెక్ రవి

ఉద్యోగం అందించే స్థాయికి ఎదగాలి

● మంత్రి సవిత ● పీ4 స్టార్టప్ కేంద్రానికి శంకుస్థాపన



పీ4 స్టార్టప్ కేంద్ర సముదాయం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే ఆర్‌.మాధవి చిత్రంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్, ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్‌.శ్రీనివాసరెడ్డి

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 19 (ఆంధ్రజ్యోతి): యువత ఉద్యోగం అందుకునే స్థాయి నుంచి అందించే స్థాయి వరకు ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత అన్నారు. కడప ఆర్ట్స్ కళాశాల సమపంలో ఏర్పాటు కానున్న స్టార్టప్ కడప ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ (పీ4) నిర్మాణానికి సోమవారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి అంటేనే ప్రతి ఒక్కరికి గుర్తుకు వచ్చేది చంద్రబాబు నాయుడు అన్నారు. ఆశించే స్థాయి కంటే శాసించే స్థాయికి ఎదగాలంటే ప్రతి ఇంటి నుంచి ఒక స్టార్టప్ ఎదగాలనే ఆయన ఆలోచన ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. ఇలాంటి స్టార్టప్ కార్యక్రమం ప్రప్రథమంగా మన జిల్లాలో ఏర్పాటు కావడం అదృష్టమన్నారు. 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీప్లస్-3 అంతస్తులతో పీఈబీ టెక్నాలజీ ఆధారంగా ఈ కేంద్రం భవన నిర్మాణం చేపడుతున్నామన్నారు. రాయలసీమ జిల్లాల్లోని యువత కడప కేంద్రం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందించే సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మాట్లాడుతూ అత్యాధునిక వసతులతో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో ఈ కేంద్రాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ రూ.4కోట్లు విరాళం ఇచ్చిందన్నారు. స్టార్టప్ కడప కేవలం ఒక భవనం మాత్రమే కాదని ఇది యువత కలలకు రూపురేఖలు ఇచ్చే వేదిక అన్నారు. ఈ సందర్భంగా నిర్మాణ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను, బిల్డింగు నమూనాను మ్యాప్ ద్వారా వివరించారు. కడప ఎమ్మెల్యే ఆర్‌.మాధవి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం నడిబొడ్డున ఉన్న కడప నగరంలో ఇలాంటి కేంద్రం ఏర్పాటు కావడంతో సాంకేతిక విద్యానైపుణ్యం ఉన్న ప్రతి విద్యార్థికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి మాట్లాడుతూ నేటి యువత బంగారు భవిష్యత్తుకు ఈ ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు. జేసీ అదితిసింగ్ మాట్లాడుతూ సీఎం సరికొత్త ఆలోచనలకు కడప నగరం వేదిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్‌.శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ పంచాయతీరాజ్, బీసీ సంక్షేమ శాఖ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

● అధికారులను ఆదేశించిన కలెక్టర్

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 26 నుంచి 29వతేదీ వరకు పర్యటించనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో సీఎం జిల్లా పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, నగర కమిషనర్ మనోజ్‌రెడ్డిలతో కలిసి జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్నారన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకండా గట్టి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రతలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీపీవో రాజ్యలక్ష్మి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు, ఫైర్ ఆఫీసరు ధర్మారావు, పోలీసు, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, పీఆర్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేయండి : ఎస్పీ



ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్‌హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులకు ఫోను చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాశ్‌బాబు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

కుదేలవుతోన్న టమోటా రైతు

● ధర లేక టమోటాలను రోడ్డు పక్కన పడేస్తున్నరైతులు
● కూలీల ఖర్చులూ రాని వైనం



6

స్కూటరు ఢీకొని మహిళ మృతి

మదనపల్లె అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): స్కూటరు ఢీకొనడంతో మహిళ మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె మండలం, పాతబోలు హరిజనవాడకు చెందిన రమణమ్మ(55) కూలి పనులకు వెళ్లి ఆదివారం సాయంత్రం ఇంటికి తిరిగి వెళుతున్న ఆమెను పోతబోలు సమీపంలో స్కూటర్ ఢీకొని తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త గతంలో చనిపోవడం, ఒక్క కుమారుడు మాత్రమే ఉండడంతో మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. అనంతరం దహనక్రియలు చేసేందుకు ప్రయత్నించారు. ఈ సమాచారాన్ని స్థానికులు తాలుకా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సోమవారం మహిళ మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

పాముకాటుతో వ్యక్తి...


మృతిచెందిన వెంకట్రమణ

లక్కిరెడ్డిపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దిరేవుల పంచాయతీలోని రెడ్డివారిపల్లెకు చెందిన వీరబల్లి వెంకట్రమణ (44) సోమవారం పాముకాటుకు గురై మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. వారి వివరాల మేరకు.. మృతుడు వెంకట్రమణ రోజు కూలి పనికి వెళ్లి జీవనం సాగించేవాడని, ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లో నిద్రిస్తుండగా కట్లపాము వచ్చి కాటు వేసిందని, దీంతో హుటాహుటిన స్థానికులు వెంకట్రమణను రాయచోటి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారని, భార్య జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లిందని తెలిపారు. కుటుంబ సభ్యులు, పిల్లలు శోక సంద్రంలో మునిగిపోయారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి...


మహమ్మద్ (ఫైల్‌ఫోటో)

సుండుపల్లె, మే 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రాయవరానికి చెందిన సర్పంచ్ షరీఫ్ తమ్ముడు షేక్.మహమ్మద్ (27) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు... రాజంపేట నుంచి ద్విచక్రవాహనంలో షేక్.మహమ్మద్, మరో యువకుడు రాయవరానికి వస్తుండగా.. సుండుపల్లె వైపు నుంచి సానిపాయి వెళ్తున్న టెంపో వాహనం మడితాడు గ్రామ పంచాయతీ కృష్ణారెడ్డి చెరువు వద్ద ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతి చెందిన యువకుడు ఎంటెక్ చదువుతున్నట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మినీ లారీ- కారు ఢీ

- ఇద్దరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో లారీ బోల్తాపడడంతో నేలపాలైన టమోటాలు

కురబలకోట, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొమ్మన్నబావి సమీపంలో మినీ లారీ, కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డ సంఘటన సోమవారం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వివరాలిలా ఉన్నాయి. కర్నాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన వారు కారులో కదిరిరోడ్డు వైపున వెళుతున్నారు. కాగా బి.కొత్తకోట మండలం గట్టుకు చెందిన రైతులు తమ పొలంలో కోసిన టమోటాలను బాక్సులో మార్కెట్ తరలించడానికి మినీ లారీలో బయలుదేరారు. కాగా దొమ్మన్నబావి సమీపంలో కారు లారీని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. కాగా లారీ బోల్తా పడటంతో టమోటాలు నేలపాలయ్యాయి. ప్రమాదంలో కారు దెబ్బతినడంతో పాటు ప్రయాణిస్తున్న మహిళ గాయపడంతో 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. అలాగే లారీలో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. కాగా ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు నాటుసారా
తయారీదారుల అరెస్టు

- 310 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం


పట్టుబడ్డ నిందితులతో రాయచోటి ఎక్సైజ్ పోలీసులు

రాయచోటిటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సంబేపల్లి మండలం శెట్టిపల్లి పెద్దబిడికి అటవీ ప్రాంతంలో సోమవారం ఎక్సైజ్ పోలీసులు మెరుపు దాడులు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మధుసూదన్ ఆదేశాల మేరకు రాయచోటి ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగేంద్ర పర్యవేక్షణలో రాయచోటి ఎక్సైజ్ సీఐ హిమబిందు, ఎస్ఐ శశిధర్, సిబ్బంది రామయ్య, మోహన్‌రెడ్డి, రాజశేఖర్, విఘ్నేశ్, హుస్సేన్ తదితరులు శెట్టిపల్లి పెద్దబిడికి అటవీ ప్రాంతంలో దాడులు చేశారు. అక్కడ నాటుసారా తయారు చేస్తున్న పెద్దబిడికి చెందిన బుక్కే భాగ్యమ్మ, బుక్కే గోబీరమ్మ అనే మహిళలను అరెస్టు చేయడంతో పాటు నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 310 లీటర్ల సారా తయారీకి ఉపయోగించే ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసి నిందితులను కోర్టుల్లో హాజరు పెట్టినట్లు ఎక్సైజ్ సీఐ తెలియజేశారు.

చికిత్స పొందుతూ..
గుర్తు తెలియని వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ఇతను వారం రోజుల క్రితం అనారోగ్యంతో ములకలచెరువు నుంచి 108 వాహనంలో వచ్చి మదనపల్లెలో చికిత్స తీసుకుంటూ ఉండేవాడు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని, మృతదేహాన్ని మార్చురికీ తరలించామని పోలీసులు తెలిపారు.

ధరలు లేకపోవడంతో తంబళ్లపల్లెలో రోడ్డు పక్కన గుట్టలుగా పోసిన టమోటాలు



నిమ్మనపల్లెలో టమోటాలను కోయకుండా వదివేసిన దృశ్యం



కుదేలవుతోన్న టమోటా రైతు

- ధర లేక టమోటాలను రోడ్డు పక్కన పడేస్తున్న రైతులు
- కూలీల ఖర్చులూ రాని వైనం

టమోటా ధరలు గణనీయంగా పడిపోవడంతో పంట సాగు చేసిన రైతులు కుదేలవుతున్నారు. కాయలను మార్కెటుకు తీసుకువెళ్తే కూలీల డబ్బులు సైతం రావడం లేదంటూ గగ్గోలు పెడుతున్నారు. ఇక చేసేదేమి లేక పండిన టమోటా పంటను కొందరు రైతులు పొలాల్లోనే వదిలేస్తుండగా.. మరికొందరు రైతులు కాయలను రోడ్డు పక్కన పారబోస్తున్నారు. దిగుబడులు బాగున్నా ధరలు పతనం కావడంతో లబోదిబోమంటున్నారు.


ధర లేకపోవడంతో టమోటాలను రోడ్డు పక్కన పడేస్తున్న రైతు

తంబళ్లపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వేరుశెనగతో పాటు టమోటాను ఎక్కువగా సాగు చేస్తారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా సుమారు 3000 ఎకరాలకు పైగా టమోటా సాగులో ఉందని అధికారుల అంచనా. గత ఏడాది చివరి వరకు టమోటా ధరలు ఆశాజనకంగానే ఉన్నా ఆ తర్వాత క్రమంగా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం మార్కెట్లో 30 కేజీల బాక్సు ధర కాయల నాణ్యతను బట్టి రూ.40 నుంచి రూ.50 వరకు ఉందని టమోటా రైతులు చెబుతున్నారు. దున్నకం, నారు, కూలీలు, మందులు, రావాణా అన్నీ కలిపి ఎకరాకు సుమారు రూ.1.2 నుంచి రూ.1.5 లక్షల వరకు పెట్టుబడి వస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం టమోటాకు ధర లేకపోవడంతో కాయలు కోసి మార్కెట్టుకు తీసుకువెళ్తే కూలీల డబ్బులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని పరుసతోపు పంచాయతీ పేండేరివారిపల్లెకు చెందిన రైతు మల్లప్ప రెండు ఎకరాల్లో రూ.2.5 లక్షలు పైగా ఖర్చు చేసి టమోటా పంట సాగు చేశాడు. పంట దిగుబడి బాగా వచ్చింది. రైతు నాలుగు రోజుల కిందట కూలీలతో పంటను కోయగా రెండు ఎకరాల్లో సుమారు 160కి పైగా బాక్సులు కోతకు వచ్చాయి. కాయలను మార్కెట్టుకు తరలించగా 30 కేజీల బాక్సు ధర రూ.40 నుంచి 50 పలికింది. ఈ ధరతో కాయలు కోసిన కూలీలకు పెట్టిన ఖర్చు కూడా రాదని ఆగ్రహించిన రైతు కాయలను తీసుకువచ్చి గ్రామానికి సమీపంలోని రోడ్డు పక్కన కాలువలో పారబోశాడు. కాసుల వర్షం కురిపిస్తుందన్న టమోటా చివరకు కూలీల ఖర్చులు సైతం రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి టమాటాకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


ధరలు తగ్గడంతో క్రేట్లలో నిల్వ వున్న టమోటాలు

అధిక దిగుబడులతో ధరలు పతనం

నిమ్మనపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఈ ఏడాది అధికంగా టమోట పంటలు వేయడంతో ధరలు పతనమయ్యాయి. హార్టికల్చర్ అధికారుల లెక్కల ప్రకారం దాదాపు 700 హెక్టార్లలో టమోట పంట సాగైనట్లు తెలుస్తోంది. ఒక ఎకరా టమాట పంటను పండించాలంటే దాదాపు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు రైతు ఖర్చు చేయాల్సి వుంటుంది. ప్రస్తుతం కలికిరి టమోట మార్కెట్‌లో 30 కేజీల టమాట ధర కేవలం రూ.50 పలికినట్లు రైతులు తెలిపారు. సరాసరి రెండు రోజుల క్రితం దాదాపు రూ.200 వున్న టమోట ధర నేడు రూ.50కి పడిపోవడంతో రైతులు డీలా పడ్డారు. కొందరు రైతులు ధర పతనం కావడంతో కాయలు కోయకుండా చెట్లలోనే వదిలేస్తున్నారు. దీనికి తోడు సాఫ్ట్‌వేర్, రిటైర్డ్, స్థానికంగా పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు సైతం వందల ఎకరాలను కొనుగోలు లేదా కౌలుకు తీసుకొని టమోట పంటలు పండిస్తుండడంతో సామాన్య రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ సారైనా ధరలు వుంటాయని వడ్డీలకు తెచ్చి ఖర్చు చేశారు. ఇదిలా వుంటే కోసిన కాయలను మార్కెట్‌కు తరలిస్తే కమీషన్, కూలీలు, బాడుగలకు పోయి ఒక్క పైసా కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదు. కొందరు రైతులు మాట్లాడుతూ.. ఈ సారి ధర కనీసం రూ.400ల కంటే తక్కువ పోతే ఆత్మహత్య చేసుకొంటామని చెబుతున్నారు. ప్రభుత్వం నికర ధరను ప్రకటించి రైతులను ఆదుకొంటే తప్ప బాగుపడే పరిస్థితి కనిపించడం లేదు.

ధరలు లేకపోతే ఆత్మహత్యే



టమోట ధరలు ఇలాగే కొనసాగితే మాకు ఆత్మహత్యలు తప్ప వేరే మార్గం లేదు. పంటకు నీరు కడితే ఎక్కడ రంగు మారుతాయో అని నీరు కూడా పెట్టడం లేదు. పైగా వైరస్ వ్యాప్తి ఎక్కువగా వుండడంతో మందులకు అధిక మొత్తం చెల్లించాల్సి వస్తుంది. ప్రభుత్వం రైతును ఆదుకోవాలి.

-శ్రీనివాసులు, గౌనిగారిపల్లి, నిమ్మనపల్లి

కడప వినియోగదారుల కమిషన్‌లో..
చైర్మన్ సహా సభ్యురాలి తొలగింపు

కలికిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్‌తో పాటు మరో మహిళా సభ్యురాలిని తొలగిస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తుది ఆదేశాల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు.. కడప జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడిగా తప్పా అబ్దుల్‌రసూల్‌ను నియమిస్తూ అప్పటి వైసీపీ ప్రభుత్వం 2022 ఫిబ్రవరి 3న ఆదేశాలు జారీ చేసింది. నాలుగేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయనతో పాటు కమిషన్‌లో మహిళా సభ్యురాలుగా అదే కాల పరిమితితో దండు అమృతను కూడా నియమించారు. ఈ రెండు నియామకాలకు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 5న ఇరువురూ బాధ్యతలు కూడా చేపట్టారు. కాగా అధ్యక్షుడు రసూల్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ వి.సుబ్బారెడ్డి, కలికిరి శిరీషాలు రాష్ట్ర హైకోర్టులో ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేశారు. అధ్యక్షుడి అర్హతలు, నియామకపు ప్రక్రియ, పద్ధతులను ప్రశ్నిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. అదే విధంగా దండు అమృత నియామకాన్ని సవాలు చేస్తూ వేదల చంద్రవదన అనే మహిళ కూడా హైకోర్టును ఆశ్రయించారు. ఈ రెండు నియామకాలను వేర్వేరుగా విచారించిన హైకోర్టు చివరకు ఇరువురి నియామకాలు చెల్లవంటూ 2024 నవంబరు 15న తీర్పు వెల్లడించింది. ఈ మేరకు తగిన ఉత్తర్వులు జారీ చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశం చింది. ఈ లోగా హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులను సవాలు చేస్తూ అబ్దుల్ రసూల్, దండు అమృతలు వేర్వేరుగా హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. రెండు నియామకాలపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు సహేతుకమేనని ఆ తీర్పును సమర్థిస్తూ ఈ ఇరువురి రిట్ అప్పీళ్లపై 2025 ఏప్రిల్ 25 డివిజన్ బెంచ్ తుది తీర్పు వెలువరించింది. దీనికి అనువుగా రెండు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని కూడా ప్రభుత్వాన్ని ఆదేశించింది. డివిజన్ బెంచ్ ఆదేశాల మేరకు వీరి నియామకాలకు సంబంధించిన ఉత్తర్వులను రద్దు చేస్తూ వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు అబ్దుల్ రసూల్, మహిళా సభ్యురాలు దండు అమృతలను పదవుల నుంచి వైదొలగాల్సిందిగా ఆదేశిస్తూ వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాల శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి సౌరబ్ గౌర్ సోమవారం విడివిడిగా ఉత్తర్వులు జారీ చేశారు.

దౌర్జన్యం చేస్తున్న గ్యాంగ్‌పై చర్యలు తీసుకోండి

- ఎస్పీకి మదనపల్లె బాధితుల వేడుకోలు


మీడియా ఎదుట వాపోతున్న మదనపల్లె బాధితులు

రాయచోటిటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): రూ.మూడున్నర కోట్లకు పైగా పలువురి దగ్గర అప్పులు తీసుకొని అప్పు ఇచ్చిన వారిపైనే దౌర్జన్యానికి పాల్పడుతూ బెదిరింపులకు గురిచేస్తున్న గ్యాంగ్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలంటూ మదనపల్లికి చెందిన సుమారు 30 మందికి పైగా బాధితులు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు తమ గోడును విన్నవించారు. ఎస్పీకి ఫిర్యాదు చేసిన అనంతరం బాధితులు మీడియాతో మాట్లాడుతూ.. జిల్లా పరిధిలోని మదనపల్లి పట్టణానికి చెందిన రమేశ్ భార్య కందుల సుజాత.. ఆమె కుమారుడు కందుల సునీల్, నరేంద్ర భార్య సుంకర లావణ్య, పద్మప్రియ, గౌరీ, నాగరత్న, నళిని, నాగమణి తదితరులతో కలిసి పట్టణంలో ఉండే ఒంటరి మహిళలను, ఫ్యామిలీలను, వృద్ధులను టార్గెట్ చేస్తూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, పిల్లలకు ఫీజు కట్టాలని నమ్మబలికి వారి వద్ద నుంచి అప్పు తీసుకుంటూ ఉండేది. ఇలా 30 మందికి పైగా మూడున్నర కోట్ల వరకు సుజాత అప్పు తీసుకుందన్నారు. అప్పు ఇచ్చిన వారు డబ్బులు అడిగితే పైన కనబరిచిన గ్యాంగ్‌తో వారి ఇంటి వద్దకు వెళ్లి వారిని నానా రకాలుగా దూషించడంతో పాటు భయభ్రాంతులకు గురిచేసి అవమానకరంగా మాట్లాడుతోందని వాపోయారు. సుజాత గ్యాంగ్ బెదిరింపులకు పాల్పడుతుండటంతో భరించలేక సమస్యను కోర్టుకు వేశామని, అయితే తమపైనే కోర్టులో వేస్తారా అంటూ మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. అదేవిధంగా ఏకాంబర్ రెడ్డి అనే అతని వద్ద రూ.60 లక్షలు అప్పు తీసుకుని వారి ఇంట్లో ఉంటూ బాడుగ అడిగినందుకు మదనపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై రేప్ కేసు పెట్టిందని మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అందరి దగ్గర అప్పులు తీసుకొని ఆమె దుబాయ్ వెళ్లిపోయిందని, పులివెందులలో కూడా ఆమెపై కేసు ఉందని వారు వివరించారు. జిల్లా పోలీసులు విచారించి తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

వైభవంగా మృత్యుంజయేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మదనపల్లెఅర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక అమ్మచెరువు మిట్టలోని మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విగ్రహప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో కంచి కామకోటి పీఠాధిపతులచే స్వామివారి నూతన విగ్రహప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించారు. ముందుగా ఆలయంలో పద్మశాలి సేవా సంఘం, ఆలయకమిటీ సభ్యులచే హోమాలు, విశేషంగా పూజలు నిర్వహించారు. ఆలయాన్ని వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. ఆలయ ఆవరణంలో ధ్వజ స్తంభం, నాగదేవతలు, వినాయకుడు, సుబ్రహ్మణ్యం స్వాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు, పద్మశాలి సేవా సంఘం సభ్యులు పర్యవేక్షించారు.


మృత్యుంజయేశ్వర స్వామి విగ్రహం

పీలేరు ఏఎంసీ పాలకవర్గం నియామకం


పురం రామ్మూర్తి, సురేంద్రరెడ్డి

పీలేరు, మే 19 (ఆంధ్రజ్యోతి): పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఏఎంసీ గౌరవాధ్యక్షుడిగా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి, అధ్యక్షుడిగా పురం రామ్మూర్తి(పీలేరు), ఉపాధ్యక్షుడిగా పి.సురేంద్రరెడ్డి (కేవీపల్లె) నియమితులయ్యారు. పీలేరు, కేవీపల్లె మండలాల పరిధిలోని పీలేరు ఏఎంసీకి సభ్యులుగా ఎస్.సుబ్బయ్య (పీలేరు), ఎం.కృష్ణమూర్తి (పీలేరు), పి.రహంతుల్లా(పీలేరు), ఎస్.శివమ్మ(పీలేరు), ఒ.రమాదేవి(పీలేరు), ఎం.సాధన(పీలేరు), ఎం.రజనీ(పీలేరు), ఎస్.అమరనాథరెడ్డి(పీలేరు), కలప రవి (పీలేరు-జనసేన), జి.కిశోర్ నాయుడు(పీలేరు), ఎ.వనిత(పీలేరు), టి.లక్ష్మీకాంతమ్మ(పీలేరు), జి.అనూరాధ(పీలేరు) నియమితులయ్యారు. స్థానిక సంస్థల నుంచి కేవీపల్లె మండలం గోరంట్లపల్లె పంచాయతీ సర్పంచ్ కృష్ణయ్య, పీలేరు పీఏసీఎస్ అధ్యక్షుడు, పీలేరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారిని కూడా సభ్యులుగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. నూతనంగా నియమితులైన ఏఎంసీ పాలకవర్గం ఏడాది కాలపరిమితితో ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చంద్రమౌళి


కోసూరి చంద్రమౌళి, నౌషాద్‌అలి

వాల్మీకిపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం నియమితులయ్యారు. కమిటీ చైర్మన్‌గా వాల్మీకిపురానికి చెందిన కోసూరి చంద్రమౌళి, వైస్ చైర్మన్‌గా గుర్రంకొండకు చెందిన షేక్.నైషాద్ అలీ నియమితులయ్యారు. అలాగే సభ్యులుగా బి.జయవర్ధిని, బి.అనసూయ, ఎన్.బయ్యారెడ్డి, డి.ప్రభాకర్, తాహీర్‌ఆలీ, డి.విజయలక్ష్మి, ఎస్.బాబా జాన్, బి.రాధ, పి.శ్రీనివాసులు, బి.సాలమ్మ, ఎం.భారతి, పి.కాంత రాజు, టి.ముబీన, తదితర సభ్యులు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి


ఉరి వేసుకుని మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

మదనపల్లెఅర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లె, మార్కెట్ యార్డులోని టమోటా వ్యాపారి గదిలో సోమవారం గుర్తు తెలియని వక్తి ఉరి వేసుకుని మృతి చెందాడు. టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. సురేంద్ర అలియాస్ దండుగాడు అని పిలువబడే ఈయన టమోటా మండీల్లో కూలి పనులు చేసుకొంటూ ఉండేవాడని స్థానికుల ద్వారా తెలిసిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు టూటౌన్ సీఐ రామచంద్ర కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.



అరచేతిలో అన్నీ సేవలు

- అందుబాటులోకి వాట్సాప్ గవర్నెన్స్ యాప్
- ఇంటి నుంచే ప్రభుత్వ సేవలు పొందే అవకాశం
- అవగాహన లేక ఆదరణ కరువు
- విస్తృత ప్రచారం ద్వారానే మంచి ఫలితాలు
- వాట్సాప్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ

బద్వేలుటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య దూరాన్ని తగ్గించే ప్రయత్నంలో కూటమి ప్రభుత్వం దూసుకు పోతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గతంలో ఇ-గవర్నెన్స్ పేరుతో ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువచేసిన ప్రభుత్వం ఇప్పుడు వాట్సాప్ గవర్నెన్స్‌కు తెరతీసింది. రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా ఆవిష్కృతమైన వాట్సాప్ గవర్నెన్స్ ఇప్పటి వరకు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ఉన్న కాస్త దూరాన్ని కూడా చెరిపేసింది. మనమిత్ర - ప్రజల చేతులో ప్రభుత్వం పేరుతో వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించి ప్రజలకు అనేక రకాల సేవలను అందించనున్నారు. గతంలో సచివాలయాలకు వెళ్లి ప్రజలు అష్టకష్టాలు పడేవారు. ఇప్పుడు మొబైల్ ఉంటే అరచేతి లోనే అన్ని ప్రభుత్వ సేవలను పొందడంతో పాటు సమస్యలపై ఫిర్యాదు చేసే అవకాశాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. మొబైల్స్ వినియోగిస్తున్న వారిలో నూటికి 90శాతం మంది వాట్సాప్‌ను వాడుతున్నారు. ఈ యాప్ ద్వారానే ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువకానున్నాయి.

మనమిత్ర నెంబర్ 9552300009 నెంబర్‌ను మొబైల్‌లో నమోదు చేసుకోవాలి. ఆ నెంబర్‌లో ఉన్న వాట్సాప్‌ను తెరచి హాయ్ అనే ఆంగ్ల పదాలను టైప్‌చేసి పంపిస్తే చాలు 161 పౌరసేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వశాఖలకు సంబంధించిన పనులను, సమస్య లను ప్రజలు తమ ఫోన్ నుంచి నేరుగా పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ యాప్‌ను ప్రవేశపెట్టింది. అయితే ప్రజల్లో సరైన అవగాహనలేక ఈ యాప్‌ను ఎలా వినియోగించాలో తెలియక సతమతమవుతున్నారు.

యాప్‌పై అవగాహన పెంచాలి

ఈ యాప్‌పై చాలా మందికి అవగాహన లేదు. అధికారులు దృష్టి సారించకపోవడంతో ఈ యాప్ ఇంకా ప్రజాదరణకు నోచుకోలేదు. కొంత మంది ఈ యాప్‌ను వాడుకుందామని చూసినా సర్వర్ లోపా లు, తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికీ చాలా మంది తమ అవసరాల కోసం కార్యాలయాలకు పరుగులు పెడుతు న్నారు. ఈ యాప్ ప్రజల్లోకి వెళ్లాలంటే దీనిపై ప్రచారాన్ని విస్తృతం చేయాలి. ఈయాప్‌ల పనితీరు, వాడే విధానంపై అధికారులకు అవగాహన కల్పించాలి.

యాప్‌లో వివరాలిలా..

ఎడ్యుకేషన్ : ఈ యాప్‌కు సంబంధించి విద్యార్థులకు అవసరమైన హాల్‌టికెట్స్‌ను నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అంతేగాకుండా విద్యా శాఖకు సంబంధించి మరింత సమాచారం ఈ యాప్ ద్వారా పొందవచ్చు.

టెంపుల్ సర్వీసెస్ : మనకు కావాల్సిన దేవాలయాల దర్శనం, రూమ్ టికెట్స్ ఈ యాప్ ద్వారా పొందవచ్చు. ఆలయాల్లో సేవ చేసుకునే ఉద్దేశ్యం ఉన్నవారు కూడా ఈయాప్ ద్వారా ఆ అవకాశాన్ని తెలుసుకోవచ్చు.

గ్రీవెన్స్ సర్వీసెస్ : ఈ యాప్ ద్వారా మనం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తే అది ఎంత వరకు వచ్చిందనే దానిపై ప్రోగ్రెస్ రిపోర్ట్ తెలుసుకోవచ్చు.

ఆర్టీసీ సర్వీసెస్ : ఆర్టీసీ బస్సులలో ఎక్కడికైనా ప్రయాణం చేయాలంటే టికెట్స్ బుక్ చేసుకునేందుకు వీలు ఉంటుంది.

హెల్త్‌కార్డు సర్వీసెస్ : ఈ యాప్‌లో ఎన్టీఆర్ వైద్యసేవను పొందవచ్చు. నూతన హెల్త్‌కార్డులను తీసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది.

రెవెన్యూ సేవలు : ఆదాయ, కులం తదితర ధ్రువపత్రాలను పొందవచ్చు. రెవెన్యూ శాఖలో ఇతర సేవలను కూడా ఈ యాప్‌ను వినియోగించుకొని పొందవచ్చు.

పోలీస్ సర్వీసెస్ : ఏవైనా ముఖ్య డాక్యుమెంట్లు, ఇతర వస్తు వులు కానీ పోగొట్టుకుంటే ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేసు కోవచ్చు. పోలీసుశాఖ నుంచి ఇతర సేవలను కూడా ఈ యాప్ ద్వారా పొందవచ్చు.

మున్సిపల్ సర్వీసెస్ : నగర పట్టణ పరిధిలోని ప్రజలు కొత్త కొళాయి కనెక్షన్, ట్రేడ్ లైసెన్స్‌లు పొందవచ్చు. అలాగే ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీస్థలం పన్నులు చెల్లించవచ్చు.



సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు : డీఆర్వో


అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం చూపకుండా తక్షణం పరిష్కరించాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు అన్నారు. సోమవారం సభా భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో డీఆర్వో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబం ధిత అధికారులు, క్షేత్రస్థాయిలో స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు, పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువు లోగా తప్పకుండా పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వారు అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అందిన విజ్ఞప్తుల్లో కొన్ని ఇలా ఉన్నాయి.

- కడప నగరం రామచంద్రాపురానికి చెందిన షేక్ హుసేన్ పీరాన్ తనకు 60 ఏళ్లు వచ్చాయని, వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని కోరారు.
- చెన్నూరు మండలానికి చెందిన మహమ్మద్ సలీం తన భూమికి హద్దులు చూపి ఆక్రమణ నుంచి కాపాడాలని విన్నవించారు.
- వల్లూరు మండలం అంబవరం గ్రామానికి చెందిన పి.ఆది నారాయణరెడ్డి తన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అభ్యర్థించారు.
- కడప చెమ్ముమియ్యాపేటకు చెందిన గోవిందయ్య తనకు టీటీసీ శిక్షణకు అర్హత ఉన్నా తరగతులకు హాజరు కావడానికి అనుమతి ఇవ్వడం లేదని.. టీటీసీ ట్రైనింగ్ సెంటరు వారిని విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు, సర్వే ల్యాండ్ అధికారి మురళీక్రిష్ణ, ఎస్డీసీలు శ్రీనివా సులు, వెంకటపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం


రూ.5లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్


బ్రహ్మంగారిమఠం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మలేపల్లె గ్రామ సమీపంలో ఈనెల 13న ఐదుగురు చిన్నారులు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ బాధిత చిన్నారుల కుటుంబం సభ్యుల ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శించారు. అనంతరం తన సొంత నిధుల నుంచి ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున రూ.5లక్షలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధైర్యపడవద్దు, టీడీపీ అండగా ఉంటుందని చిన్నా రుల తల్లి దండ్రులకు భరోసా ఇచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, నాయకులు కాణాల మల్లికార్జునరెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, వెల్లటూరు సాంబశివారెడ్డి, మిల్లు శ్రీను, సర్పంచ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయం కడపకు వరం : మంత్రి సవిత


భూమి పూజా కార్యక్రమంలో ఇన్‌చార్జి మంత్రి సవిత, ఎమ్మెల్యేలు మాధవి, చైతన్యరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన దాయకమైన గొప్ప పుస్తక సంపదను కలిగిన బ్రౌన్ గ్రంథాలయం కడపకు వర మని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సంజీవరెడ్డిగారి సవిత అన్నారు. సోమవారం ఉదయం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రాంగణంలో నూతన భవన నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన ఘనత స్వర్గీయ ఎన్టీ రామా రావుదే అన్నారు. 1995లో ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబునా యుడు బ్రౌన్ గ్రంథాలయాన్ని అధికారికంగా ప్రారంభించారని, ఇపుడు నిర్మించబోయే నూతన భవనాన్ని కూడా ఆయన చేతనే ప్రారంభింపజేస్తామన్నారు. వైవీయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాస రావు మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని కీర్తింపబడిందని, తెలుగు భాషా సాహిత్యాలకు ప్రధాన కేంద్రంగా బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని తీర్చిదిద్దుతామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వ సహాయ సహకారాలు మరింత అందేలా చూస్తామన్నారు. కడప ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ కడప అంటే ఇతర ప్రాంత ప్రజలకు చిన్నచూపు ఉందని, కానీ బ్రౌన్ గ్రంథాలయం లాంటి విజ్ఞాన సౌధం ఆ అపనిందను రూపు మాపేలా వెలిసిందన్నారు. గ్రంథాలయలో ఉన్న తాళపత్ర గ్రంథాలను, ఇతర రాతప్రతులను ప్రత్యేకంగా చూపిస్తూ డాక్యుమెంటరీ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయంలో తెలుగుభాషతో పాటు ఇతర భాషలకు చెందిన గ్రంథాలు అందుబాటులోకి తేవడం వల్ల మరింత విస్తృతికి తోడ్పడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మాట్లా డుతూ గ్రంథాలయ నూతన భవన నిర్మాణా నికి ప్రభుత్వ సహకారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యాలకు బ్రౌన్ గ్రంథాలయం మూల కేం ద్రంగా ఉందని, జిల్లా ప్రజలందరు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంసల హామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడారు. రిజిస్ట్రార్ పుత్తా పద్మ ఆహ్వానం పలుకగా సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి వందన సమర్పణ చేశారు. యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, కడప ఆర్‌డీఓ ఇర్విన్, నగర కమిషనర్ మనోజ్‌రెడ్డి, మెప్మా పీడీ కృష్ణకుమార్, వైవీయూ పాలక మండలి సభ్యులు, బోధన, బోధనేతర సిబ్బంది, సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరో ఇద్దరికి గాయాలు


మృతి చెందిన రాణా

కొండాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు తాళ్ల ప్రొద్దుటూరు వైసీపీ కార్యాలయం సమీపంలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వస్తున్న ముగ్గురిని నెల్లూరుకు వెళుతున్న కారు ఢీకొంది. ఈసంఘటనలో ప్రొద్దుటూరుకు చెందిన రాణా (65) అనే వ్యక్తి మృతి చెందగా, దొమ్మరనంద్యాలకు బాబు, ఓబులేసు గాయపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనంలో తాడిపత్రికి తర లించారు. వీరంతా పుట్టువెంట్రుకల కోసం తాళ్లప్రొద్దుటూరుకు వచ్చి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. కేసు నమోదు చేసుకుని దర్యా ప్తు చేస్తున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వరరెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు గుంతలో పడి వ్యక్తి మృతి


అబల్‌మాజీ మృతదేహం

బ్రహ్మంగారిమఠం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లె గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే పనుల్లో భాగంగా పని చేస్తుండగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన అబల్‌మాజీ (45) అనే వ్యక్తి సోమవారం ఉదయం ప్రమాదవశాత్తు గుంతలో పైనుంచి జారి కింద పడటంతో మృతి చెందాడు. మృతదేహాన్ని బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

కేజీపీజీసెట్ ఫలితాలు విడుదల



కేజీపీజీ సెట్ ఫలితాలను విడుదల చేస్తున్న కందుల విద్యాసంస్థల ఎండీ కందుల చంద్ర ఓబుళరెడ్డి (నాని), కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ తదితరులు

సీకేదిన్నె, మే 19 (ఆంధ్రజ్యోతి): కేజీపీజీసెట్ 2కే25 ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు కందుల విద్యాసంస్థల కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి, కరస్పాండెంట్ రాజేశ్వరమ్మలు తెలిపారు. కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం వారు సంయుక్తంగా ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 నుంచి ఈ పరీక్ష లునిర్వహించడం జరుగుతోందని.. ప్రతిసంవత్సరం లాగే ఈ ఏడాది కూడా విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. 200 మంది పరీక్ష రాయగా 104 మంది అర్హత సాధించారని, మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి ఉచిత విద్యను కల్పిస్తామని తెలిపారు.

ఏఐసీటీఈ అనుమతి : 2025-26 విద్యాసంవత్సరానికి ఎంబీఏ పీజీ కోర్సు ప్రారంభించేందుకు ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) నుంచి 120 సీట్లకు అనుమతి లభించినట్లు వారు తెలిపారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మేనేజ్‌మెంట్ విద్యను అందించాలన్న లక్ష్యంతో అనుమతి పొందామన్నారు. కేఎస్ఆర్ఎం ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరప్రసాద్, కేఎల్ఎంప్రిన్సిపాల్ ఎంవీ రత్నమ్మ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి రాయపాటి నాగరాజు పాల్గొన్నారు.

పేద పిల్లల అవసరాల గుర్తింపునకు సతి కమిటీ

- అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఆసిఫా సుల్తానా



కడప రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల పిల్లల అభ్యున్నతి కోసం డిస్ట్రిక్ట్ సతి కమిటీని ఏర్పాటు చేసినట్లు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ సి.ఆసిఫా సుల్తానా పేర్కొన్నారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాసదన్‌లో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ డిస్ట్రిక్ సతి కమిటీ పేద పిల్లల అవసరాలను గుర్తించి వారికి తగు న్యాయ సహాయం అందజేస్తుందన్నారు. ఈ కమిటీ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అధికారుల సహకారంతో సర్వే చేయడంతో పాటు ఆధార్ రిజిస్ట్రేషన్ క్యాంప్స్ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమాలు మే నుంచి ఆగష్టు 15 వరకు కొనసాగుతాయన్నారు. ఈ సర్వేలో జిల్లా వ్యాప్తంగా పానల్ న్యాయవాదులతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్, విద్య, వైద్య, చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్, ఆర్గనైజర్స్ తదితర శాఖల అధికారులు పాల్గొని పేద విద్యార్థుల డేటాను సేకరించి ప్రభుత్వ పథకాలు అందేవిధంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ చొరవ తీసుకుంటుందన్నారు. అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మనోజ్ హెగ్డే, జిల్లా రెవెన్యూ ఆఫీసర్ ఎంవీ నాయుడు, రాయచోటి రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారికి వసంతోత్సవం, చక్రస్నానం

జమ్మలమడుగు, మే 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని నారాపురం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారికి వసంతోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజకు హాజరైన భక్తులు వసంతోత్సవం ఆడారు. ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తుండడంతో శ్రీవారి ఊరేగింపు రద్దు చేసి ఆలయ ప్రాంగణంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి.. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ఆలయ పూజారులు చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం ధ్వజావరోహణం, మహాపూర్ణాహుతి, మహాకుంభప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.


శ్రీవారికి చక్రస్నానం చేస్తున్న పూజారులు

పోటాపోటీగా బండలాగుడు పోటీలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా పతంగే రామన్నరావు జిల్లా పరిషత్ హైస్కూలుమైదానంలో రెండో రోజు సోమవారం ఉదయం సీనియర్ విభాగం బండలాగుడు పోటీలు పోటాపోటీగా కొనసాగాయి. ఈ సందర్భంగా కొందరు పందేలు కాశారు. కాగా, మొదటిరోజు న్యూకేటగిరి, సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించారు. ఇందులో బోరెడ్డి కేశవరెడ్డి (పెద్దకొట్టాల), సుంకిసురేంద్ర రెడ్డి (తెలంగాణాకు చెందిన హుజూర్‌నగర్) ఎడ్లు విజేతగా నిలిచి మొదటి బహుమతి గెలుచుకున్నాయి. వీరికి జమ్మలమడుగు పట్టణానికి చెందిన శివకుమార్‌రెడ్డి, కూటమి నాయకులు దేవగుడి శివ నారాయణరెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వర రెడ్డి రూ.1.50 లక్షలు అందజేశారు. రెండోస్థానంలో నిలిచిన ఎడ్ల యజమాని అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన రామాంజనేయులుకు ద్వితీయ బహుమతి కింద రూ.1.20 లక్షలు దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీ వారు అందజేశారు. మూడో బహుమతి రామసుబ్బారెడ్డి (హుసేలాపురం, నంద్యాల జిల్లా)కి రూ.90 వేలు మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి అందజేశారు. 4వ బహుమతి రమేష్ బాబు (తాడిపత్రి), ద్వార్శల గురివిరెడ్డి (ప్రొద్దుటూరు)కి రూ.70 వేలను పెద్దదండ్లూరు సర్పంచ్ గువ్వల రామాంజనేయరెడ్డి అందజేశారు. 5వ బహుమతిగా కుందూరు రాంభూపాల్‌రెడ్డి, మాధవ రెడ్డి (చిన్నకొమెర్ల, మైలవరం మండలం)లకు రూ.50 వేలను నగళ్లపాటి రవీంద్రకుమార్ అందజేశారు. అలాగే 6 నుంచి 9వ స్థానం వరకు నిలిచిన ఎడ్ల యజ మానులకు బహుమతులు అందజేశారు. పోటీలు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి పర్యవేక్షణలో పోటీలు విజయవంతం జరిగాయి.



బండలాగుడు పోటీలు, మొదటి బహుమతి విజేతకు రూ.1.50 లక్షలు అందజేస్తున్న శివనారాయణరెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి

మత్స్యకారుల సహకార సంఘాల
పీఐసీల పదవీకాలం పొడిగింపు

కడప రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల సహకార సంఘాల నాన్-అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జీల పదవీకాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగించారు. ఈ మేరకు జిల్లాలోని కడప నగరం అల్మాస్‌పేట పిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ నాన్ అఫీషియల్‌గా వై. రెడ్డెయ్య, ప్రొద్దుటూరు పిషర్ మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ నాన్‌అఫీషియల్‌గా ఎం. నాగరాజు, పెద్దముడియం మండలం పాలూరు పిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటి నాన్ అఫీషియల్‌గా కె. శ్రీనివాసుల పదవీ కాలాన్ని 2025 మార్చి 14 నుంచి 2025 సెప్టెంబర్ 13 వరకు పొడిగించారు. ఈమేరకు మత్స్యశాఖ కమిషనర్ సోమవారం జీవో ఆర్‌టీ నెంబర్ 172ను జారీ చేశారు.

దళిత విద్యార్థిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

కడప ఎర్రముక్కపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి చేసిన వారిన కఠినంగా శిక్షించాలని జై భీమ్ మాల మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు పల్లెకొండు సంపత్ డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం జైభీమ్ మాల మహాసేన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి బీటెక్ విద్యార్థి జేమ్స్‌పై దాడి చాలా అమానుషం, కుల రక్కసి ఉన్మాదులుఅతనిపై అహంకారంతో దాడిచేశారన్నారు. జేమ్స్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ మాల మహాసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు లెప్రసీ అలవెన్స్ ఇవ్వాలి



మాట్లాడుతున్న మరియమ్మ

కడప మారుతీనగర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆశా కార్యకర్తలకు ఇవ్వాల్సిన లెప్రసీ మొత్తాన్ని తక్షణమే ఇవ్వాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి.శాంతమ్మ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఐదేళ్లుగా లెప్రసీ సర్వే చేసిన ఆశా కార్యకర్తలకు సంవత్సరానికి రెండు సర్వేల ప్రకారం ఇవ్వవలసిన అలవెన్స్ మొత్తాన్ని ఇంత వరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. తక్షణం లెప్రసీ అలవెన్స్ మొత్తాన్ని విడుదల చేయకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లాకోశాధికారి సి.అమ్ములు, నగర అధ్యక్షురాలు ఎఎల్ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే విక్రయాలు జరపాలి
లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ కె.జె.రవీంద్రరెడ్డి



కడప నాగరాజుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీకే విక్రయాలు జరపాలని లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ కె.జె.రవీంద్రరెడ్డి దుకాణాదారులకు సూచించారు. ప్రపంచ మెట్రాలజీ వారోత్సవాల సందర్భంగా లీగల్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ బస్టాండ్‌లోని దుకాణాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తినుబండారాలు, కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్ తదితర వస్తువులను నిబంధనల మేరకే విక్రయించాలని, నిబంధనలు పాటించకుంటే చట్టరీత్యాచర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

మహానాడు విజయవంతం మనందరి బాధ్యత
పులివెందులకు సీఎం ప్రత్యేక ప్రాధాన్యం : మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి


పులివెందుల మినీ మహానాడులో మాట్లాడుతున్న బీటెక్ రవి, సమావేశానికి హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

పులివెందుల, మే 19 (ఆంధ్రజ్యోతి): కడపలో జరగనున్న మహానాడును విజయవంతం చేసే బాధ్యత మనందరిపై ఉందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి మహానాడు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీటెక్ రవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మహానాడు కార్యక్రమంలో కడప జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణ చేయాలని నాయకులు నిర్ణయిం చారన్నారు. పులివెందుల ప్రాంతం కడపకు కొంత దూరం అవుతుందని, 10 నుంచి 15వేల మందిని తరలిస్తామని రాష్ట్ర నాయకులకు మాటిచ్చామ న్నారు. మహానాడుకు తరలివెళ్లేందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. మహానాడుకు వెళ్లేందుకు వాహనసౌకర్యాలు ఏం అవసరమవుతాయో తమ దృష్టికి తేవాలన్నారు. అనంతపురం జిల్లాకు సంబంధించి దాదాపు 10 నుంచి 12 నియోజక వర్గాల టీడీపీ శ్రేణులు పులివెందుల మీదుగా మహానాడుకు వెళ్తాయ న్నారు. ఈ సమయంలో మధ్యాహ్న భోజన కార్యక్ర మాలు పులివెందులలో ఏర్పాట్లు చేస్తామని మాటిచ్చామన్నారు. ఈ ఏర్పాట్లను దగ్గరుండి చూసుకోవాలన్నారు. ఈ ఏర్పాట్లను చూసుకొని మహానాడు కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. ప్రభుత్వం వచ్చి పది పదకొండు నెలలు అవుతున్నా పనులు జరగడం లేదని బయటకు చెప్పకపోయిన కొందరి మనసులో ఈ మాట ఉందన్నది వాస్తవమన్నారు. పనులు సరిగా కాలేదని, ఈ విషయమై గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాన న్నారు. కానీ ఇటీవల కదిరి నరసింహస్వామి గుడికి నారాలోకేశ్ వచ్చినపుడు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఐదేళ్ల జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఇక్కడ టీడీపీ వారిని ఎన్నో ఇబ్బందులకు గురిచేసినప్పటికి 90వేల నుంచి 60వేలకు మెజార్టీని తగ్గించిన ఘనత టీడీపీ శ్రేణులదేనన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల, మున్సిపల్ ఎన్నికలకు మనం సిద్ధం కావాలన్నారు. పులివెందుల మున్సి పాలిటీని టీడీపీ కైవసం చేసుకునేందుకు అందరు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం మాజీ జడ్పీ టీసీ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మినీ మహానాడులో పులివెందుల నియోజకవర్గానికి సంబంధించి పలు అంశాలపై తీర్మానాలు పెట్టి మద్దతు పొందారు.అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధి రెడ్డి, టీడీపీ నాయకుడు వెంకటరామిరెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ నియోజక వర్గ ఉపాధ్యక్షులు రామగంగిరెడ్డి, రఘునాథరెడ్డి, శివమోహన్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి,రామమునిరెడ్డి పాల్గొన్నారు.

నీలం సంజీవరెడ్డికి ఘన నివాళులు


నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి తదితరులు

వేంపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): రైతు బిడ్డ రాష్ట్రపతి కాగలడని నిరూపించిన వ్యక్తి స్వర్గీయ నీలం సంజీవరెడ్డి అని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధిడాక్టర్ ఎన్.తులసిరెడ్డి కొనియాడారు. సంజీవరెడ్డి జయంతిని సోమవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శం, అనుసరణీయం, మార్గదర్శక మన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పులివెందుల సమన్వయకర్త ధ్రువకుమార్‌రెడ్డి, వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు రామకృష తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం ఆదర్శవంతం

కడప సెవెన్ రోడ్స్, మే 19 (ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శవంతమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా సీపీఎం ఘన నివాళులర్పించింది. కార్యక్రమంలో సీపీఎం సభ్యులు మనోహర్, దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి, నారాయణరెడ్డి, డీవైఎఫ్ఐ విజయ్, సీఐటీయూ నాయకులు ఉదయ్, మహిళా సంఘం నాయకులు హాజరయ్యారు.

ప్రకృతి వ్యవసాయమే ఉత్తమం



వేములలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహిస్తున్న ర్యాలీ

వేముల, మే 19 (ఆంధ్రజ్యోతి): భూ పర్యావరణ పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయమే శరణ్యం అని వెలుగు ఏపీఎం అంజనేయులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన వేములలో డ్వాక్రా మహిళా రైతులతో ప్రకృతి వ్యవసాయ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ జ్యోతి, యూనిట్ ఇన్‌చార్జి రామ్మోహన్‌నాయుడు, అంజన్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె..: మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో ప్రకృతి వ్యవసాయంపై సోమవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామస్థాయి అధికారిని శకుంతల దేవి, మండలస్థాయి అధికారి వెంకటరామిరెడ్డి రైతులకు ప్రకృతి వ్యవసాయం చేసే విధానంపై వివరాలు తెలిపారు. ముఖ్యఅతిథిగా భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధుసూధన్‌రెడ్డి, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రకృతివ్యవసాయం చేసే వేమారెడ్డి, రామాంజనేయరెడ్డిలను సత్కరించారు. ర్యాలీ నిర్వహించి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వక్తలు మాట్లాడుతూ సమాజానికి ఆరోగ్యకరమైన ఆహారం అందించడంలో రైతులు బాధ్యతగా ముందుకు రావాలన ప్రకృతి వ్యవసాయాన్ని చేయాలని రైతులకు అవగాహన కల్పించి అనంతరం ప్రభుత్వం ముద్రించిన పత్రాలను పంపిణీ చేశారు.

పాలకొండ్రాయుడుకు ఘన నివాళులు


పాలకొండ్రాయుడు సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రయ్య, టీడీపీ నాయకుడు హరిప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు పెద్దకర్మ కార్యక్రమానికి సోమవారం ఎమ్మెల్సీ రామచంద్రయ్య, టీడీపీ రాష్ట్ర కార్యని ర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్ హాజరయ్యారు. పాలకొండ్రాయుడు సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బండి బాబు, బండారు సత్యనారాయణ, గంధం ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో హాజరుకాని ఉపాధ్యాయులకు బదిలీ అవకాశం కల్పించాలి


డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): వివిధ అనారోగ్య కారణాలతో 2024 సాధారణ ఎన్నికల్లో విధులకు హాజరు కాలేకపోయిన ఉపాధ్యాయులకు ప్రస్తుతం జరిగే ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లలో అవకాశం కల్పించాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఇలియాస్ బాష, సెక్రటరీ జనరల్ రాళ్లపల్లె అబ్దుల్లా డిమాండ్ చేశారు. సోమవారం డీఈఓ కార్యాలయలో షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మానవతా దృక్పథంతో అనారోగ్యంగా, వ్యక్తిగత కారణాలతో ఎన్నికల విధులకు హాజరుకాని ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు టి.ఖాదర్‌బాష, కె.నరసింహరావు, మహబూబ్ బాష, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చేపల కోసం వెళ్లి ప్రాణాలు పోగొట్టుకోవద్దు
ట్రాన్స్‌కో ఏఈఈ రామలింగారెడ్డి

చెన్నూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఎవరైనా చేపలు పట్టాలంటూ నదీ పరీవాహక ప్రాంతాల్లోకి వెళ్లవద్దని, అక్కడ ఉన్న పరిస్థితులు ఒకవేళ విద్యుత్ మోటార్ల లైన్లు ఉన్నా జాగ్రత్తగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి తెలిపారు. చెన్నూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం గుర్రంపాడుకు చెందిన పత్తూరు గణేశ్ అనే యువకుడు చేపల కోసం వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకున్నారన్నారు.

తిరుమలేశుడి ఆశీస్సులతో మహానాడు దిగ్విజయం కావాలి

కడప మారుతీనగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయ్యేలా ఆ తిరుమలేశుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని టీడీపీ తొగట వీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు మడక చక్రధర్ ఆకాంక్షించారు. తిరుమల తొలిగడప దేవునికడపలో వెలసిన కడప రాయుడిని ఆయన సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ప్రసాదాన్ని మహానాడు సభా కార్యక్రమం ఏర్పాట్లను పర్యవేక్షించడానికి కడపకు విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితను కలిసి స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

ప్రారంభమైన హనుమజ్జయంతి ఉత్సవాలు


హనుమజ్జయంతి ఉత్సవాలకు హోమాలు నిర్వహించి అంకురార్పణ చేస్తున్న వేదపండితులు

చక్రాయపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో సోమవారం అంకురార్పణతో హనుమత్‌జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు హనుమత్‌జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. హనుమత్ జయంతి ఉత్సవాలకు సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకుడు కేసరి, ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్ అన్ని ఏర్పాట్లు చేశారు. హనుమత్‌జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తులకు చలువపందిళ్లు, క్యూలైన్లు, విద్యుత్ అలంకరణలతో పాటు లడ్డూ ప్రసాదాలు ఏర్పాట్లుచేశారు. ఈ ఏడాది గతం కంటే వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. సోమవారం సాయంత్రం అనుజ్ఞ, విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధన ధారణ, వాస్తుహోమం, గోష్టి కార్యక్రమాలు నిర్వహించారు.

యురేనియం వ్యర్థాల నుంచి కాపాడండి
యూసీఐఎల్ పరీవాహక ప్రజలు


బీటెక్ రవికి సమస్యను విన్నవిస్తున్న ప్రజలు

పులివెందుల, మే 19 (ఆంధ్రజ్యోతి): యూసీఐఎల్ టైలింగ్ పాండ్ నుంచి వస్తున్న వ్యర్థాల అనర్థాల నుంచి కాపాడాలని యూసీఐఎల్ పరివాహక గ్రామాల ప్రజలు పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్‌రవి) ముందు సమస్యలు ఏకరువుపెట్టారు. సోమవారం ఉదయం 11గంటల ప్రాంతంలో యూసీఐఎల్ పరీవాహక గ్రామాల ప్రజలు టీడీపీ కార్యాలయంలో బీటెక్ రవిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యురేనియం ప్రాజెక్టు నుంచి వెలువడే వ్యర్థాలను టైలింగ్ పాండ్‌లో నిల్వ చేస్తున్నారన్నారు. టైలింగ్ పాండ్ వల్ల కలిగే అనర్థాల నుంచి యురేనియం ట్రేడ్ యూనియన్ నాయకులు బీటెక్ రవికి పలు అంశాలను వివరించారు. అందుకు ఆయన స్పందిస్తూ మంగళవారం అధికారులతో కలిసి టైలింగ్ పాండ్‌ను పరిశీలిస్తామన్నారు. అక్కడ పరిస్థితులను అధికారులతో చర్చించి వాటిని ప్రభుత్వం దృష్టికి, యూసీఐఎల్ ప్రధాన కార్యాలయం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రైతుల అభిప్రాయాలు సేకరించాలి
ఏరువాక కేంద్రం సమన్వయకర్త అంకయ్యకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అంకయ్యకుమార్

సీకేదిన్నె, మే 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యార్థులు రైతుల అభిప్రాయాలను క్షేత్రస్థాయిలో సేకరించాలని ఏరువాక కేంద్రం సమన్వయకర్త అంకయ్యకుమార్ తెలిపారు. శ్రీ వెంకటేశ్వర కళాశాల తిరుపతి విద్యార్థులు చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్ల గ్రామంలో రైతు సదస్సు సాంకేతిక ప్రదర్శనల మూడు నెలల శిక్షణ ముగింపు సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అంకయ్యకుమార్ మాట్లాడుతూ ఆచార్య ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమం ప్రారంభించారు. ఇందులో భాగంగా 30 మంది విద్యార్థులను మండలంలోని తాడిగొట్ల, ఇప్పెంట తదితర గ్రామాల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంకేతిక ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త వీరయ్య, కీటక విభాగం శాస్త్రవేత్త పాండురంగ, విస్తరణాధికారులు సురేష్‌కుమార్‌రెడ్డి, నాగరాజు, స్థానిక సర్పంచ్, రైతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టులోకి 400 క్యూసెక్కుల వరదనీరు

కొండాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులగా కురుస్తున్న వర్షాల వల్ల గండికోట ప్రాజెక్టులోకి సరాసరి 400 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరిందని ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, తాగునీటి స్కీమ్‌కు 25 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఈఈ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 17.5 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఆయన తెలిపారు.

నేడు ప్రొద్దుటూరులో మినీ మహానాడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలో మంగళవారం టీడీపీ మినీ మహానాడు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని భారత్ ఫంక్షన్ హాలులో మినీ మహానాడును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం కార్యకర్తలందరికీ భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ మినీమహానాడుకు ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి పాల్గొననున్నట్లు వెల్లడించారు. 1982 స్వర్గీయ నందమూరి తారకరామారావు ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పార్టీ మహానాడులను నిర్వహిస్తోందన్నారు. నియోజకవర్గంలోని క్యాడర్ అంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్ రెడ్డిలు పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయండి

మైదుకూరు రూరల్ ,మే 19(ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగనున్న తెలుగు దేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక బద్వేల్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో సోమవారం మైదుకూరు నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు కార్యక్రమం ఎమ్మెల్యే అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరుగనున్న మహానాడులో సీఎం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. ఇందులో భాగంగా కేపీ ఉల్లి కేంద్రాలను ఏర్పాటు చేయాలని, కేసీ కెనాల్ కాలువల మరమ్మత్తులు, అలగనూరు రిజర్వాయర్‌కు 36 కోట్లతో పనుల చేస్తే కేసీ కెనాల్ ఆయకట్టు కింద రెండు కార్ల పంటలను పండించుకోవచ్చని, మైదుకూరుకు వంద పడకల ఆసుపత్రి, బీసీ బాలుర గురుకుల పాఠశాల తదితర అంశాలపై సమావేశంలో చర్చించి తీర్మాణం చేశారు. అనంతరం ఎమ్మెల్యే పుట్టా మాట్లాడుతూ అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా మైదుకూరు మున్సిపాలిటీలో ప్రతి ఇంటికి తాగునీటిని అందించాలనే ఉద్దేశ్యంతో సుమారు రూ.99 కోట్లు, శెట్టివారిపల్లె చెరువు ఆధునీకీకరణ, మరమ్మతులకు గాను సుమారు రూ.2 కోట్ల 20 లక్షల ను మంజూరు చేయించినట్లు తెలిపారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని ఐదు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించామని శ్మశానవాటికల మరమ్మతులకు సుమారు రూ.5 కోట్ల నిధులను మంజూరు చేయించామని తెలిపారు. టీడీపీ స్థాపించినటప్పటి నుంచి మొదటిసారిగా కడపలో జరుగనున్న మహానాడు కార్యక్రమాన్ని టీడీపీ కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు, నాయకులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

అల్లాడుపల్లె వీరభద్రస్వామికి రూ.లక్ష వితరణ

చాపాడు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామికి చాపాడు గ్రామానికి చెందిన బత్తల చిన్నకులాయన్న, సుబ్బలక్ష్మీ అనే దంపతులు సోమవారం లక్ష రూపాయల చెక్కును వితరణగా ఇచ్చినట్లు ఆ దేవస్థానం ఈవో శ్రీనివాసులు తెలిపారు. ఈ డబ్బులతో భక్తులకు శాశ్వత అన్నదానం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ డబ్బులను మైదుకూరులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నామన్నారు. అందులో కమిటీ మాజీ ఛైర్మన్ వీరనారాయణయాదవ్, ఈవో, సిబ్బంది దంపతులను పూలమాలలతో సన్మానించారు.

రతనాల వేంకటేశ్వరునికి శ్రవణ నక్షత్ర పూజలు

ప్రొద్దుటూరు టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత మార్కెట్‌లోని రతనాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రతనాల వేంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితాదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించి పసుపు, కుంకుమ, దీపాలతో స్వామివారిని అర్చించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



పుష్పాలంకరణలో రతనాల వెంకటేశ్వరస్వామి

పుచ్చలపల్లి సుందరయ్య అందరికీ ఆదర్శం



సుందరయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న శ్రీను

బద్వేలు, మే 19(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య అందరికి ఆదర్శమని సీపీఎం నేతలు పేర్కొన్నారు. బద్వేలులోని సీపీఎం ఆద్వర్యంలో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సభ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సభా భవనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మున్సిపాలిటీ పట్టణ కార్యదర్శి కె.శ్రీను పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా అలగాని పాడు గ్రామంలో భూ స్వామి కుటుంబంలో జన్మించిన ఆయన విద్యార్థి దశనుంచే కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులయ్యారన్నారు. సుందరయ్య నడిచిన బాటలో కమ్యూనిస్టు పార్టీ నేతలు, కార్యకర్తలు నడవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చిన్ని, మస్తాన్ , ఖైరూన్‌బి తదితఋలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్‌లో: సుందరయ్య 40వ వర్ధంతిని పురష్కరించుకుని సోమవారం సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ పేదలు, సమాజం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయకుమార్, సాల్మన్, ప్రమీళ, రాఘవ, ఓబులేసు, చెన్నారెడ్డి, సుబ్బలక్ష్మి, రాములమ్మ పాల్గొన్నారు.

అట్లూరులో : సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం అట్లూరు సీపీయం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు రమణ, నాగరాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక వ్యవస్థపై సుందరయ్య తన దైన శైలిలో ముద్ర వేశారన్నారు. మహిళలు దుర్గమ్మ, లత పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: దేశానికి ఆదర్శప్రాయుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ అన్నారు. సోమవారం పోరుమామిళ్లలోని జీబీ నగర్ కాలనీలో సుందరయ్య 40వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటి సభ్యురాలు ఓబులమ్మ, రవి, షరీఫ్ పాల్గొన్నారు.

మైలవరంలో: పుచ్చలపల్లి సుందరయ్య సేవలు మరువలేనివని చేనేత సంఘం కార్మిక జిల్లా అధ్యక్షుడు శివనారాయణ పేర్కొన్నారు. సోమవారం పుచ్చలపల్లి వర్ధంతి సందర్భంగా మైలవరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ సుందరయ్య ఒక పెద్ద కుటుంబంలో పుట్టి సామాన్య మానవుడిగా తన జీవితానికి ప్రజలకు అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎల్లయ్య, సీపీఎం నాయకులు మోహన్, కృష్ణ, ముని తదితరులు పాల్గొన్నారు.

కాశినాయనలో: స్వాతంత్ర్య సమరయోధుడు కమ్యూనిస్టు ఉద్యమనేత పుచ్చలపల్లి సుందరయ్యను రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకొని భూపంపిణీకి శ్రీకారం చుట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అన్వేష్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సావిశెట్టిపల్లెలో సుందరయ్య 40 వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాలులర్పించారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి పోలయ్య పలువురు కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

గ్రామ సేవకులకు పదోన్నతులు కల్పించాలి



ఆర్డీవో సాయిశ్రీకి వినతిపత్రం ఇస్తున్న గ్రామ సేవకుల సంఘం నాయకులు

జమ్మలమడుగు, మే 19 (ఆంధ్రజ్యోతి): గామ సేవకులకు అర్హతను బట్టి పదోన్నతులు కల్పించాలని ఆ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు, జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి ఆర్డీవో సాయిశ్రీకి అర్జీలు అందజేశారు. అందులో భాగంగా జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో సంఘ నేతలు ఆర్డీవో సాయిశ్రీకి వినతి పత్రం అందజేశారు. గ్రామ సేవకుల సమస్యపై గతంలో కూడా వినతి పత్రాలు అందించినట్లు తెలిపారు. మదనపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారికి గ్రామ సహాయకులు వినతి పత్రాలు అందించడంతో పది మందికి వాచ్‌మెన్, 10 మందికి అటెండర్ పోస్టులు మంజూరు చేశారని తమకు కూడా పదోన్నతులు కల్పించాలని ఆర్డీవోకు విజ్ఞప్తి చేశారు. వెంటనే ఆర్డీవో సాయిశ్రీ గ్రామ సేవకుల సమస్యలకు సంబంధించి ఉన్నతాధికారులకు తెలియజేస్తానని చెప్పారు. అలాగే ప్రొద్దుటూరుకు చెందిన పలు ప్రాంతాలవారు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవకులు గురుమోహన్, ఖాజాహుస్సేన్, రత్నం, దానియేలు, సుబ్బరాయుడు, పాములేటి, చంద్రశేఖర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

గోపవరం పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక ప్రశాంతం



ఎన్నికైన ఉపసర్పంచ్ రాఘవేంద్రారెడ్డితో వార్డు సభ్యులు

ప్రొద్దుటూరు , మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం స్థానిక గోపవరం పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ ప్రారంభించారు. వైసీపీ తరపున బీరం రాఘవేంద్రారెడ్డి ఉపసర్పంచ్‌గా 6 వవార్డు సభ్యుడు కేశవరెడ్డి ప్రతిపాదించగా 20 వవార్డు సభ్యుడు వెంకటేశ్వర్లు రాఘవేంద్రారెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. మొత్తం 20 మంది వార్డు సభ్యుల్లో 14 మంది వైసీపీ సభ్యులు ఉన్నారు. టీడీపీ తరుపున ఎవ్వరూ పోటీ లేకపోవడంతో పాటు వారందర ఎన్నికకు హజరుకాలేదు. దీంతో ఉప సర్పంచ్‌గా రాఘవేంద్రారెడ్డిని ఎన్నికల అధికారి రామచంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. గోపవరం పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక కోసం మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించడంతో వార్డు సభ్యులకు పోలీసులు రక్షణ కల్పించాలని కోర్టు ఆదేశించింది. దీంతో ఎన్నిక సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ భావన, సీఐలు సదాశివయ్య బాలమద్దిలేటి గోవిందరెడ్డిలతో పాటు ఎస్ఐలు సిబ్బంది పెద్దఎత్తున బందోబస్తు నిర్వహించారు.

వీరజవాన్ మురళీనాయక్ కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్మీ ఆఫీసర్‌కు చెక్కు అందజేస్తున్న నిర్మాత గణపతిరెడ్డి, సినిమా బృందం

దువ్వూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌లో అసువులుబాసిన వీర జవాన్ మురళీనాయక్ కుటుంబానికి పలువురు అండగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగా దువ్వూరు మండలం పెద్దజొన్నవరం గ్రామానికి చెందిన టి.గణపతిరెడ్డి అరుణశ్రీ ఎంటర్‌టైన్‌మెంట్ తరుపున ఆర్మీ ఆఫీసర్ ఒబేరాయ్ చేతుల మీదుగా ఆ కుటుంబానికి ఇవ్వమని రూ.2.07 లక్షలు చెక్కును అందజేశారు. సినీ నిర్మాత అయిన గణపతిరెడ్డి వచ్చినవాడు గౌతమ్ అనే సినిమా ఆడియో రిలీజ్ సందర్భంగా హైదరాబాదులో అందరి సమక్షంలో ఆ చెక్కును ఇచ్చారు. గణపతిరెడ్డి ఈ విషయాన్ని వివరిస్తూ మురళీనాయక్ త్యాగం అందరికి ఆదర్శమన్నారు. 14 మంది పాకిస్తాన్ సైనికులను చంపి వీరమరణం పొందిన త్యాగమూర్తి మురళీనాయక్ అని కొనియాడారు. దేశ సేవకు మించిన సేవ లేదని ఆయన పేర్కొన్నారు.

కార్యకర్తలకు జనసేన అండ


జమ్మలమడుగు, మే 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు జనసేన పార్టీ అండగా ఉంటుందని నియోజకవర్గ జనసేన కోఆర్డినేటర్ డాక్టర్ నల్లంశెట్టి నాగార్జున హామీ ఇచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాయలంలో మంగళగిరిలో జనసేనపార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన ప్రతినిధులు 26 మంది క్రియాశీలక వలంటీర్లకు కిట్లు అందజేశారు. సభ్యత్వం ద్వారా అన్ని రకాలుగా కార్యకర్తలకు జనసేన అధినేత అండగా ఉంటారన్నారు. పార్టీ నేతలు గురుకుమార్, కాటంరాయుడు, గురుశేఖర్‌రెడ్డి, దిలీప్‌రాజా, ప్రతాప్ రెడ్డి, హుస్సేన్‌వలి, బాబావలి పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు



రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్

పోరుమామిళ్ల , మే 19 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ఖచ్చితంగా ధరించాలని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన పోరుమామిళ్లలోని వసుంధర కళ్యాణ మండపం వద్ద రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ అతివేగంగా వాహనాలు నడపరాదని, ఓవర్‌లోడుతో వెళ్లరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి పాల్గొన్నారు.



శ్మశాన వాటికకు ఎమ్మెల్యే భూమిపూజ

చాపాడు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్మశాన వాటికకు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సోమవారం భూమిపూజ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.20 లక్షలతో శ్మశాన వాటికను నిర్మిస్తున్నట్లు ఏపీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. గేటు, రెండు రూములు, నీళ్ల ట్యాంకు, పెన్సింగ్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. పచ్చదనం కోసం మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, కేసీకెనాల్ కమిటీ వైస్‌ఛైర్మన్ గురివిరెడ్డి, టీడీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామమోహన్, జైనుల్లా, తదితరులు పాల్గొన్నారు.

మురుగుకాలువలు అస్తవ్యస్తం



గోకులనగర్‌లో మురుగుకాలువ దుస్థితి పై సీపీఐ నాయకుల నిరసన

ప్రొద్దుటూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం గోకుల్ నగర్‌లో మురుగు కాలువలను అస్తవ్యస్తంగా నిర్మించారని అందువల్ల ఇక్కడ డ్రైనేజీ అధ్వానంగా ఉందని సీపీఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు ఆరోపించారు. మంగళవారం స్థానిక గోకుల్ నగర్‌కు సీపీఐ బృందం వెళ్లి కాలువలు పరిశీలిం చింది. ఈ సందర్భంగా సుబ్బరాయడుడు మాట్లాడుతూ కాలువ లను కేవలం కాంట్రాక్టర్ల కాసులకోసం నిర్మించారు తప్ప అక్కడ ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. నాసిరకంగా కాలువలు నిర్మించిన వారిపై చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు.

బి.కోడూరులో భారీ వర్షం

బి.కోడూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): బి.కోడూరు మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు మండలమంతా పూర్తిగా వర్షం పడుతూనే ఉంది. దీంతో రైతులకు సరైన సమయంలో దుక్కులు దున్నుకునేందుకు వీలుంటుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వర్షంతో వ్యాపారులకు తీవ్రఇక్కట్లు



దుకాణాలకు పట్టలు కప్పిన వ్యాపారులు

జమ్మలమడుగు, మే 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ఉరుములు, మెరుపులు, గాలితో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో శ్రీనారాపురం వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయం చుట్టూ ఏర్పాటు చేసుకున్న వివిధ రకాల దుకాణాలు వ్యాపారాలు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసుకున్న దుకాణాలకు బహిరంగ వేలంలో రూ.10 లక్షలకుపైగా పాట దక్కించుకున్నారు. అయితే వ్యాపారస్థులకు గేటు వసూళ్లు ముందుగానే చేశారు. ప్రతిరోజు సాయంత్రం వేళల్లో వర్షం కురియడంతో వ్యాపారులకు నష్టం వచ్చినట్లుగా వాపోతున్నారు. రథోత్సవం రోజు వ్యాపారాలు బాగా జరుగుతాయని ఆశ పెట్టుకున్న వర్షంతో ఇబ్బందులు తలెత్తాయి. సోమవారం వర్షం కురియడంతో వ్యాపారులు పట్టలు కప్పుకుని ఖాళీగా కూర్చోవాల్సి వచ్చింది.

అభివృద్ధికి అందరి సహకారం అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బిజివేముల రమణమ్మ

బద్వేలు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం అవసరమని మండల అధ్యక్షురాలు బిజివేముల రమణమ్మ అన్నారు. సోమవారం స్థానిక మండల సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో రామనాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కొత్త పక్కాగృహాల మంజూరు, 2019లోపు ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన భవనాల క్రమబద్ధీకరణ, గ్రామాల్లో పారిశుధ్యం వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టులోకి 400 క్యూసెక్కుల వరదనీరు

కొండాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): గత రెండురోజులగా కురుస్తున్న వర్షాల వల్ల గండికోట ప్రాజెక్టులోకి సరాసరి 400 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరిందని ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం జీఎన్ఎస్ఎస్ ప్రధా న కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, తాగునీటి స్కీమ్‌కు 25 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఈఈ తెలిపారు. కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 17.5 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటిసామర్థ్యం 26.85 టీఎంసీలు ఉంది.

హనుమద్ జయంతిశోభాయాత్రకు తరలిరండి

ఎర్రగుంట్ల, మే 19(ఆంధ్రజ్యోతి): వీర హనుమాన్ జయంత్యుత్సవం పురస్కరించుకుని ఈనెల 22వ తేదీ (గురువారం) ఏర్పాటు చేస్తున్న శోభాయాత్రకు హిందూవులంతా తరలిరావాలని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ సేవకులు పిలుపునిచ్చారు. ఈమేరకు వారు శోభాయాత్ర రూట్‌మ్యాప్‌ను విడుదల చేశారు. గురువారం సాయంత్రం 4గంటలకు ఎర్రగుంట్ల నడివూరు రామాలయం నుంచి ప్రారంభమై ప్రొద్దుటూరు రోడ్డువరకు సాగుతుందని తెలిపారు. రథంపై హనుమంతుడిని ఊరేగింపుగా తీసుకొస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

మైలవరంలో: మండల పరిధిలోని జి.ఉప్పలపాడు గ్రామంలో వెలసిన అతి పురాతన అభయాంజనేయస్వామి దేవాలయంలో ఈనెల 22న గురువారం హనుమద్ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఉదయం చెక్కభజన, రాత్రికి నటరాజు కళాబృందం వారిచే శాసవల చిన్నమ్మకథ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

సమస్యల పరిష్కారం కోసం అర్జీల వెల్లువ



దేవగుడిలో అర్జీలు స్వీకరించి మాట్లాడుతున్న భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడి గ్రామంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్ రెడ్డి స్వగృహం వద్ద నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీలు అందజేశారు. సోమవారం భూపేశ్‌రెడ్డికి అర్జీలు అందించి వారి వారి సమస్యలను తెలియజేశారు. నియోజకవర్గంలోని కొందరు రెవెన్యూ అధికారులు భూ సమస్యలపై స్పందించడంలేదని కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం రేషన్‌కార్డుల సమస్యలపై, కొత్త పింఛన్ల కోసం పలువురు దరఖాస్తులు అందించారు. వచ్చిన కార్యకర్తలు, నాయకులు ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో ఆయన ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జమ్మలమడుగు, ముద్దనూరు, ఎర్రగుంట్ల తదితర ప్రాంతాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. అలాగే ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడు సభకు పార్కింగ్ విషయమై ఆ ప్రాంతానికి వెళ్లి సీఐలు సదాశివయ్య, బాలమద్దిలేటి, అధికారులతో భూపేశ్‌రెడ్డి మాట్లాడారు.

భక్తిశ్రద్ధలతో ఇటుకులపాడులో విగ్రహ ప్రతిష్ఠ

కాశినాయన మే19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇటుకులపాడు లో నూతనంగా నిర్మించిన ముచు కుందేశ్వర జ్ఞానప్రసూనాంబ దేవాల యంలో భక్తిశ్రద్ధలతో సోమవారంతో విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. శనివారం ప్రారంభమైన ప్రతిష్ఠోత్సవాలు మూడవ రోజైన సోమవారం మూల విరాట్‌ల ప్రతిష్ఠ,.ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈప్రతిష్ఠోత్సవాలకుఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, నాయకుడు కరెంట్ రమ ణారెడ్డి, మండల నాయకుడు జి.హనుమంత్‌రెడ్డి, బద్వేల్ నియోజకవర్గ అదనపు సమ న్వయకర్త ఎన్.విశ్వనాద్‌రెడ్డి, కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్వి రెడ్డి, స్థానిక టీడీపీ నాయకుడు వెంకటసుబ్బయ్య యాదవ్ వేర్వేరుగా వచ్చి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల మూడురోజులు భక్తులకు పెద్దఎత్తున అన్నదానం చేపట్టారు. నూతన ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ఇటుకులపాడు లో బండలాగుడు పోటీలు పోటా పోటీగా సాగాయి. ఈపోటీలల్లో ప్రొద్దుటూరుకు చెందిన మార్తల చంద్ర ఓబుల్‌రెడ్డి ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ.100000 రెండవ స్థానంలో మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేష్‌యాదవ్ రూ.70వేలు, మూడ వ స్థానంలో ఖాజీపేట మండలం కొత్తూరుకు చెందిన కర్ర బాలయ్య ఎద్దులు రూ.50వేలు గెలుచుకున్నాయి.

కాలువలో పడిన జింకలను కాపాడిన స్థానికులు

కాశినాయన మే19(ఆంధ్రజ్యోతి) మండలంలోని సావిశెట్టిపల్లె వద్ద తెలుగంగ ఎడమ కాలువలో సోమవారం నీటికోసం వచ్చిన రెండు జింకలు కాలువలో జారిపడి బయటికి రాలేక ఇబ్బంది పడ్డాయి. ఇది గుర్తించిన స్థానికులు వాటిని సురక్షితంగా బయటికి తీసి అటవీశాఖ అధికారులకు ఇవ్వగా వారు వాటిని సమీప అడవుల్లో వదిలారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

ఖాజీపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని భూమాయపల్లె సమీపంలో కారు ఢీకొన్న సంఘటనలో ఇల్లూరి రామలక్షుమ్మకు గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు సోమవారం కమలాపురం మండలానికి చెందిన రామలక్షుమ్మ పని నిమిత్తం అమ్మ శరణాలయం వద్దకు వచ్చి కారును గమనించకుండా రోడ్డు క్రాస్ అవుతుండడంతో కారు ఢీకొంది. ఈ సంఘటనలో ఆమెకు గాయాలు కావడంతో 108 ద్వారా ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

